జగనన్న ఇల్లు.. సంతోషాల హరివిల్లు







- పేదల సొంతింటి కల నెరవేరింది
- కాలనీల్లో మౌలిక వసతుల కల్పన

దెండులూరు: నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతమయ్యాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలనే ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి నియోజకవర్గంలో ఇళ్లు లేని పేదలకు స్థలాలు కేటాయించారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో అవస్థలు పడుతూ కాలం వెళ్లదీస్తున్న వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని దెండులూరు నియోజకవర్గంలో 19 వేల మందికి ఏలూరు రూరల్, పెదవేగి, పెదపాడు, దెండులూరు మండలాల్లో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణం మంజూరు పత్రం సైతం లబ్ధిదారులకు అందజేశారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామగ్రామాన జగనన్న కాలనీలు ఊళ్లను తలపించేలా గృహనిర్మాణాలు పూర్తయ్యాయి. కాలనీల్లో విద్యుత్ స్థంభాల ఏర్పాటు, రోడ్లు, తాగునీరు, మౌలిక వసతుల పనులు చకచకా పూర్తయ్యాయి. ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వం కేటాయించిన సెంటున్నర స్థలంలో అత్యంత ఆకర్షణీయంగా లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకున్నారు.

ఇంటి రుణం వివరాలు

ఒక్కొక్క ఇంటికి రూ. 1,80,000 మంజూరుతో పాటు అదనంగా డ్వాక్రా గ్రూపు నుంచి రూ. 35,000 మంజూరు చేస్తున్నారు. మొత్తం రూ. 2,35,000 ఇంటి రుణం ప్రభుత్వం అందిస్తోంది. నాలుగు దశల్లో ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు నిర్మాణ పనులను పరిశీలించి బిల్లులు లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌కు జమ చేస్తున్నారు.

నియోజకవర్గంలో గృహనిర్మాణం వివరాలు

నియోజకవర్గం	స్థలాల మంజూరు	ప్రారంభించినవి	పూర్తైనవి	లేవుట్లు
ఏలూరు మండలం	3,269	931	596	22
పెదపాడు	4,075	1,605	913	48
పెదవేగి	6,000	2,882	1,109	66
దెండులూరు	3,508	832	1,448	41

శాశ్వత భద్రత లభించింది



మా కుటుంబానికి జగనన్న ఇల్లు మంజూరు ద్వారా శాశ్వతంగా భద్రత లభించింది. స్వగ్రామంలో ఇంటి స్థలంతో పాటు ఇంటి రుణం మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యేకు మా కుటుంబమంతా రుణపడి ఉంటాం. మాకు శాశ్వత భద్రత లభించింది.

– కాంద్రు ప్రసన్న, లబ్ధిదారురాలు, అలుగులగూడెం

వైఎస్సార్ బాటలో సీఎం వైఎస్ జగన్



దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ బాటలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారు. పాదయాత్రలో చెప్పిన విధంగా ఒక అడుగు ముందుకేసీ పేదలందరికీ శాశ్వత లబ్ధి చేకూర్చేలా నివసించేందుకు ఇళ్లు నిర్మిస్తున్నారు. మా కుటుంబమంతా చాలా సంతోషంగా ఉన్నాం.

– గంజి అంజలి, లబ్ధిదారురాలు కొవ్వలి

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి. ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంతోషంగా అందరూ జీవించాలనే లక్ష్యంతో ఒక్కసారే ఇళ్ల స్థలాలు, రుణ అర్హత పత్రాలు మంజూరు చేశారు.

– దారం సునంద, లబ్ధిదారురాలు, పోతునూరు

ఎన్నికైన ఎమ్మెల్సీలను అభినందించిన నాయకులు



ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తదితరులు



ఎమ్మెల్సీగా ఎన్నికైన వంక రవీంద్రను కలిసి అభినందనలు తెలుపుతున్న ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ప్రజాప్రతినిధులు

పెదపాడు: ఇటీవల జిల్లాలో జరిగిన స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుల ఎన్నికల్లో గెలుపొందిన కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్‌ను దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, పెదపాడు మండల నాయకులు పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. శాసన మండలి సభ్యులుగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన వారిని కలిసి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, మండల కొండలరావు, సాధం కిశోర్, నంబూరు రఘు పాల్గొన్నారు.

వంక రవీంద్రను కలిసిన ఉంగుటూరు ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి

ఉంగుటూరు: ఎమ్మెల్సీగా గెలుపొందిన వంక రవీంద్రను ఉంగుటూరు ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, పలువురు ప్రజాప్రనిధులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టిపాపారావుబాబ్జి, బాదంపూడి ఎంపీటీసీ తొప్పెట్ల వరలక్ష్మి, చేబ్రోలు ఎంపీటీసీ సభ్యులు మనసాల నాగమణి, రాయి లక్ష్మి చేబ్రోలు మాజీ సర్పంచి కరణం బుజ్జి, తదితరులు తణుకులో వంక రవీంద్ర నివాసానికి వెళ్లి కలిసారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌కు అభినందనలు తెలిపారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాల మంజూరు



స్థలాలను పరిశీలిస్తున్న ఏలూరు ఆర్డీవో పెంచల కిషోర్, తహసీల్దార్ షంషూద్దీన్ తదితరులు

భీమడోలు: నవరత్నాలు అందరికీ ఇళ్లు పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఏలూరు ఆర్డీవో పెంచల కిషోర్ అన్నారు. మండలంలోని గుండుగొలను శివారు రత్నాపురంలో ఓ ఆక్వా రైతు చెర్వు తవ్వడం వల్ల పంట నష్టపోతున్నానని ఆయకట్టు రైతు మామిళ్లపల్లి సుధీర్ పలు సార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని ఆంధ్రా సుగర్స్ యాజమాన్యం రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమించుకుని ఆ భూమికి బదులుగా యాజమాన్యం రెండు ఎకరాలు కొనుగోలు చేసి ప్రభుత్వానికి అందించేందుకు అంగీకారం తెలిపింది. దీనిపై విచారించేందుకు ఏలూరు ఆర్డీవో పెంచల కిషోర్ ఆ ప్రాంతాలను శుక్రవారం సందర్శించారు. గుండుగొలను శివారు రత్నాపురంలో కొండా కుమార్‌స్వామి రాజు తనకు చెందిన 4 ఎకరాల భూమి ఆక్వా జోన్‌లో ఉన్నందున అనుమతులు పొంది చేపల చెర్వుగా మార్చుకున్నాడు. సమీప రైతు సుధీర్ ఆక్వా చెర్వు వల్ల పొలంలో పంట పండక నష్టపోతున్నానని, న్యాయం చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసారు. ఆక్వా చెర్వును, ఆయకట్టు పొలాలను ఆర్డీవో పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు రెండు ఎకరాల భూమిని అందించేందుకు సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం అంగీకరించిన నేపథ్యంలో అందరికీ ఆమోదయోగ్యంగా ఉన్న భూమిని కొనుగోలు చేసే క్రమంలో ఆ పొలాలను ఆయన పరిశీలించారు. సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షంషూద్దీన్, ఎఫ్‌డీవో మంగరావు, వీఆర్వోలు వెంకటేశ్వరరావు, గోవింద్, మౌనయ్, సిబ్బంది పాల్గొన్నారు.

మొండికోడు పాఠశాల అభివృద్ధికి చర్యలు

ఏలూరు రూరల్: మండలంలోని మొండికోడు ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు చెప్పారు. నాడు-నేడు నిధులతో పాఠశాల ప్రహరీ, తరగతి గదుల నిర్మాణాలను సైతం పూర్తి చేస్తామన్నారు. పాఠశాలను మరింత సుందరంగా, మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తామన్నారు. అదేవిధంగా సుమారు రూ.2లక్షలతో పాఠశాల గ్రావెల్ రోడ్డును సీసీ రోడ్డుగా మారుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కమిటీ సభ్యురాలు సీహెచ్ సుభాకాంత్, ఎంపీడీవో ప్రణవి, ఈఓపీఆర్డీ సరళ కుమారి తదితరులు పాల్గొన్నారు.

19న గుంటూరులో కబడ్డీ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్: ఈ నెల 23వ తేదీ నుంచి 26 వరకూ హర్యానాలో 69వ సీనియర్ మహిళ జాతీయ కబడ్డీ పోటీలు జరగనున్నాయని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్‌కోచ్ బి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టును ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు గుంటూరు బిఆర్ స్టేడియంలో ఎంపిక జరుగుతుందని వెల్లడించారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వైస్‌చైర్మన్ కె హర్షవర్ధన్ పరివేక్షణలో జరిగే ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన క్రీడాకారులు జాతీయ పోటీల్లో పాల్గొనే అర్హత సాధిస్తారన్నారు.

రిక్షా కార్మికుడికి ట్రై సైకిల్ అందజేత



పోలసానిపల్లిలో రిక్షా కార్మికుడు బాలస్వామికి ట్రై సైకిల్ అందజేస్తున్న రామిశెట్టి గంగాధరరావు

భీమడోలు: పోలసానిపల్లికి చెందిన నిరుపేద రిక్షా కార్మికుడు ఉప్పే బాలస్వామికి రూ.10వేల విలువ గల ట్రై సైకిల్‌ను శుక్రవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అందించారు. కార్మికుడు బాలస్వామి మధుమేహం బారిన పడడంతో నెల రోజుల క్రితం అతని కాలు తొలగించారు. ఈ నేపథ్యంలో అతడు నడిచేందుకు అవకాశం లేనందున రైతు సహకార సంఘం ఎండీ రామిశెట్టి రాంబాబు స్పందించి ఆదుకున్నారు. ఆయనను మానవత సంస్థ ప్రతినిధులు పరామర్శించారు. భీమడోలు రైతు సేవా సహకార సంఘం ఎండీ, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు రామిశెట్టి రాంబాబు, నాగలక్ష్మీ దంపతుల ఆర్థిక సాయం రూ.10వేలతో బాలస్వామికి ట్రై సైకిల్‌ను పోలసానిపల్లిలోని బాలస్వామి ఇంటి వద్ద మానవత ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మండల చైర్మన్ గుల్ల నూకరాజు, మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు ఉన్నమట్ల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ చిలపర్తి రామారాయుడు, మానవత సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. జీలుగుమిల్లి మండలం ములగలంపల్లికి చెందిన కంచర్ల హర్షవర్ధన్ జంగారెడ్డిగూడెం వైపు వస్తుండగా, మానుకొండ మనోజ్‌కుమార్ అశ్వారావుపేట వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. స్థానిక భాష్యం స్కూల్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మనోజ్‌కుమార్‌కు స్వల్ప గాయాలు కాగా, హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదే దారిలో కారులో వెళుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైసీపీ నాయకుడు బత్తిన చిన్న తమ కారులో క్షతగాత్రులను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి క్షతగాత్రుల కుటుంబ సభ్యులు వచ్చి ఇద్దరినీ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మనోజ్ కుమార్ చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి వెళ్లిపోగా, హర్షవర్ధన్ చికిత్స పొందుతున్నాడు.

ముగిసిన సాయిమందిర వార్షికోత్సవాలు

పెదవేగి: మండలంలోని రాట్నాలకుంటలో వేంచేసియున్న షిరిడీసాయి మందిరంలో వైభవంగా నిర్వహిస్తున్న 19వ వార్షికోత్సవ వేడుకలు ముగిసాయి. కొఠారు అబ్బయ్య మెమోరియల్ షిర్డిసాయి చారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలకు శుక్రవారం భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం కాకడ హారతి, ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి, అయ్యప్పస్వామి, షిర్డిసాయి, నాగేంద్రస్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఆలయ ట్రస్టీ కొఠారు రామచంద్రరావు దంపతులు పాల్గొని బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన భారీ అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు చావలి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బాబాను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు చళ్లగొళ్ళ వెంకటేశ్వరరావు, బ్యాంక్ రాజు, బుజ్జి, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

వేలేరుపాడు: మండలంలోని కన్నాయిగుట్ట, టేకూరులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం మంచినీటి డ్రమ్ములు, ఐరన్ మంచాలు పంపిణీ చేశారు. కన్నాయిగుట్టలో 27 గిరిజన కుటుంబాలకు, టేకూరులో మూడు కుటుంబాలకు 200 వందల లీటర్ల మంచినీళ్లు పట్టే డ్రమ్ములు అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.3 వేల విలువ చేసే వస్తువులు అందజేశారు. తిర్లాపురం సర్పంచ్ సోడె విజయ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాటిమ్మ తల్లి ఆలయంలో యాగశాల ప్రవేశం



చల్లచింతలపూడిలో పాటిమ్మ తల్లి ఆలయంలో యాగశాల ప్రవేశం కార్యక్రమం

దెండులూరు: చల్లచింతలపూడిలోని యలమర్తివారి ఆడపడుచు పాటిమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలుత అమ్మవారి ఆలయ ఆవరణలో యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వరుని పూజ, పుణ్యాహవాచనం, దీక్షధారణ, అంకురారోహణ, మండపారాధన, అగ్నిప్రతిష్ఠాపన నిర్వహించారు. పలువురు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. తొలుత సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, మాజీ సర్పంచ్ యలమర్తి హేమలతా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వృద్ధులకు కంటి పరీక్షలు



వృద్ధురాలికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: కంటి సమస్యలపై నిర్లక్ష్యం తగదని, కంటికి సంబంధించి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు ప్రభుత్వం ఇస్తుందని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. శుక్రవారం గణపవరం పీహెచ్‌సీ పరిధిలోని సరిపల్లె సచివాలయం వద్ద వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కంటి ఆరోగ్యానికి పలు సూచనలు ఇచ్చారు. ఎక్కువగా ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సుమారు 60 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించామన్నారు. వీరందరికీ ఉచితంగా కళ్లజోళ్లు ఇస్తామని కంటి వెలుగు అధికారి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి కిరణ్మయి, సీహెచ్‌వో జె.విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మకు అభిషేకం



దెండులూరులో అమ్మవారికి అభిషేకం చేసేందుకు కలశాలతో వెళ్తున్న మహిళలు

దెండులూరు: దెండులూరులో శుక్రవారం రామదండు ఆధ్వర్యంలో శోభాయాత్ర అంగరంగ వైభవంగా మేళతాళాలతో కనుల పండుగగా జరిగింది. తొలుత విష్ణు ఆలయంలో స్వామివారి దర్శనం చేసుకుని 108 ముత్తైదువులు, 108 కలశాలతో గ్రామంలోని గంగానమ్మకు అభిషేకం చేశారు. గ్రామంలో ఉన్న 9 మంది గ్రామదేవతలకు 108 మంది ముత్తైదువులు పసుపు, కుంకుమ సమర్పించి భారీ ఊరేగింపు నిర్వహించారు. దేవదేవేరుల శోభాయాత్రలో భక్తులు, మహిళలు, రామదండు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ



సానిగూడెంలో దాసాంజనేయస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

దెండులూరు: సానిగూడెంలోని నూతనంగా నిర్మించిన దాసాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు), విజయలక్ష్మి దంపతులు విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తొలుత గ్రామ సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు), విజయలక్ష్మి, మాజీ సర్పంచులు యలమర్తి శ్రీనివాసరావు పద్మజా హోమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, ఆలయ ప్రదక్షిణలు చేశారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

సమర్థ నీటి వినియోగంతో సత్ఫలితాలు

బుట్టాయగూడెం: వ్యవసాయ సాగుకు సమర్థ నీటి వినియోగంపై రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలని కేఆర్‌పురం ఐటీడీఏ వ్యవసాయ శాఖ ఏడీఏ ఏజీ బుచ్చిబాబు మండలంలోని కండ్రికగూడెంలో సమర్థ నీటి వినియోగంపై ఐటీసీ– ఎంఎస్‌కె బైఫ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ అధునాతన పద్ధతుల ద్వారా పంటలకు నీటి వినియోగాన్ని తగ్గిస్తూ పంట దిగుబడి పెంచే విధంగా అవగాహన పెంచుకోవాలని అన్నారు. సంస్థ రాష్ట్ర ప్రతినిధి గోపాలరెడ్డి, ఎండీఓ కేఆర్ఎస్ ప్రసాద్, ఏఓ బి. సుమలత పాల్గొన్నారు.

దోమలతోనే వ్యాధుల వ్యాప్తి

గణపవరం: డెంగీతో పాటు అనేక రకాల ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తి కారణమైన దోమల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని వైద్య సిబ్బంది కోరారు. అపరిశుభ్రత, దోమలవల్ల వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని వారు ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని కాశిపాడు, చిలకంపాడులో డ్రైడేలో భాగంగా ప్రజలకు డెంగీ, మలేరియా వ్యాధుల వ్యాప్తి, లక్షణాలు, దోమల వృద్ధి, నివారణ, ఫ్రైడే డ్రైడేగా పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ఇళ్ల వద్ద పాత్రలలో నిల్వఉంచిన నీటిలో పెరుగుతున్న దోమల లార్వాను చూపించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో దోమలు వృద్ధి చెందుతాయని అన్నారు. దోమలు వృద్ధిని అరికట్టేందుకు అందరూ నడుం బిగించాలని కోరారు. ఎవరికైనా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వెన్నునొప్పి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి, రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి అపరిశుభ్రత, మురుగునీటి నిల్వలు, దోమల వ్యాప్తి, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. జిల్లా పీఎంపీ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చల్లాలమ్మ ఉత్సవాలు ఉగాది నుంచి ప్రారంభం

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామ దేవత చల్లాలమ్మ ఉత్సవాలు ఉగాది నుంచి ప్రారంభమై 5 రోజులు కొనసాగనున్నాయి. గ్రామంలోని వీధుల్లో ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని ఊరేగిస్తారు. తొలుత పోతురాజు పూరిగుడిసెకు, ఆ తరువాత పుట్టిల్లు అయిన తల్లాప్రగడ వారి ఇంటికి అమ్మవారిని తీసుకు వెళతారు. చల్లాలమ్మను కొలిస్తే పాడి పంటలకు కొదవ ఉండదని, పిల్ల పాపలతో శుభిక్షంగా ఉంటారని స్థానికుల నమ్మకం. వివాహాలు సమయంలో తొలిసారిగా అమ్మవారికి చలివిడి పానకాలు పోస్తారు. ఆతరువాత పెళ్లి కార్యక్రమాలు ప్రారంభిస్తారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాలకు గ్రామంలో ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.

గ్రామీణాభివృద్ధికి సహకార సంఘాలు దోహదం



డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు సహకార బ్యాంకింగ్‌ను వివరిస్తున్న సొసైటీ కార్యదర్శి నారాయణ

గణపవరం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతాంగానికి ఆర్థికంగా అండగా ఉండటంలో సహకార రంగానికి ఎనలేని ప్రాధాన్యత ఉందని గణపవరం సొసైటీ కార్యదర్శి బుద్దాల నారాయణ అన్నారు. శుక్రవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బీకాం చదువుతున్న విద్యార్థులకు సహకార రంగం, సొసైటీ బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సుకు ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో నారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాల సేవలు, రైతాంగానికి అందిస్తున్న రుణాలు, డిపాజిట్లు, ఎరువుల పంపిణీ, నిత్యావసర సరకుల విక్రయాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ మధురాజు, ఎకనామిక్స్ అధ్యాపకురాలు స్వరూపరాణి, కామర్స్ అధ్యాపకుడు పి.బాలమణికంఠ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవం



గుండుగొలను ఆలయంలో ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భీమడోలు: గుండుగొలనులో శ్రీదేవి భూసమేత వేంకటేశ్వర స్వామి వారి వార్షిక మహోత్సవ వేడుక శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, దాతల ఆర్థిక సాయంతో ఆలయాన్ని పునర్నిర్మించి ఏడాది పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వార్లకు ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ, దేవాదాయ ధర్మశాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో మార్టేరుకు చెందిన శ్రీనివాసుల విజయగోపాలచార్యులు, పానింగిపల్లి మోహనకృష్ణామాచార్యులు, మంగపతి అచార్యులు, సుధీరాచార్యులతో పాటు 12 అర్చక బృందం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర వారిని విశేషంగా అలంకరించి ముస్తాబు చేసారు. స్వామి వార్లకు మహాభిషేక పూజలు, సుదర్శన హోమాలు నిర్వహించారు. కొత్త ఉత్సవ మూర్తులను ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు ఆలయానికి సమర్పించారు. అనంతరం శాంతి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసారు. ఈ కార్యక్రమంలో ఈవో డి.శంకరరావు, అధిక సంఖ్యలో భక్తులు, పెద్దలు పాల్గొన్నారు.

రహదారిపై ఆక్రమణల తొలగింపు



కలపర్రు వై జంక్షన్ వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పెదపాడు: గోగులపాడు పరిధిలోని కలపర్రు వైజంక్షన్ వద్ద కలపర్రు, వట్లూరు రహదారిపై ఆక్రమణల తొలగించారు. పెదపాడు మండల తహసీల్దార్‌కు ఆక్రమణలు తొలగించాలని ఆర్‌అండ్‌బీ పోలీసు అధికారుల నుంచి ఫిర్యాదు రావడంతో శుక్రవారం అధికారులు ఆక్రమణలను తొలగించారు. రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో పాటు ట్రాఫిక్ జామ్, రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయని, శివారు ప్రాంతం కావడంతో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆర్ అండ్‌బీ అధికారులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ స్పందించి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్వోలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.